కాళేశ్వరంపై 'కాగ్' గరంగరం

- డిపిఆర్ లేకుండానే రూ.25వేలకోట్ల పనులు
- తగ్గిన 50 వేల ఎకరాల ఆయకట్టు
- నీళ్ల అమ్మకం పేరుతో 15 బ్యాంకుల నుంచి రూ.87 వేల కోట్ల అప్పులు
- భూకంపాల జోన్‌లో మల్లన్నసాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు బండారాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) బయటపెట్టింది. పథకం అంచనాల దగ్గర నుంచి టెండర్ల అప్పగింత వరకూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని తూర్పారబట్టింది. అంచనాలన్నీ సరైనవి కావని తేల్చి చెప్పింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)లోనూ తప్పుడు సమాచారాన్ని చూపించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాజెక్టు అంచనాలు, నిర్మాణం, నాణ్యత అన్నింటిలోనూ అవకతవకలు జరిగాయని అభిప్రాయపడింది. డిపిఆర్ లేకుండానే రూ.25,049 కోట్ల పనులు కంపెనీలకు అప్పగించడాన్ని తన నివేదికలో కడిగేసింది. ఇష్టారాజ్యంగా అంచనా వ్యయాలు ఉన్నాయని అభిప్రాయపడింది ప్రాజెక్టులకు చెందిన వార్షిక ఖర్చులనూ తక్కువ చూపి ప్రజాధనానికి విలువలేకుండా చేశారని విమర్శించింది. నీళ్ల అమ్మకం పేరుతో దాదాపు 15 బ్యాంకుల నుంచి రూ.87 వేల కోట్ల అప్పులు తెచ్చారని స్పష్టం చేసింది. గురువారం కేంద్ర ప్రభుత్వ రంగ ఆడిట్ సంస్థ 'కాగ్' అసెంబ్లీలో తన నివేదికను ప్రవేశపెట్టింది. కాగ్ తెలంగాణ అకౌంటెంట్ జనరల్(ఆడిట్) పి.మాధవి, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ జె. నిఖిల్‌చక్రవర్తి పేర ఈ నివేదిక విడుదలైంది. ఇందులో ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు (ఇసిసిసిపి) నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు దాకా ఆడిట్ చేసిన వివరాలను పొందుపరిచారు. ప్రధానంగాప్రాణహితఅంచనాలను తప్పుబడుతూనే కాళేశ్వరం లోపాలపై కాగ్ అక్షింతలు వేసింది. ప్రాజెక్టు ద్వారా ప్రజలు, రైతులకు లాభం జరగకపోగా, 50 వేల ఎకరాల ఆయకట్టు తగ్గిందని గుర్తు చేసింది. డిపిఆర్‌లో రూ.63,352 కోట్లు ఖర్చవుతుందని చెప్పిన గత ప్రభుత్వం, దానిని ఎప్పటికిప్పుడు పెంచుకుంటూ పోయి చివరకు రూ.1,06,000 కోట్ల దాకా అంచనా వ్యయాన్ని తీసుకెళ్లిందని తెలిపింది. ప్రాజెక్టు మొత్తం పూర్తయ్యేనాటికి రూ.1,47,427 కోట్ల ఖర్చయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ప్రపంచంలోనే ఎనిమిదో వింతగా ప్రచారం చేసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు లోగుట్టును కాగ్ నివేదిక రట్టుచేసింది.

నీళ్లు అమ్ముతామంటూ అప్పులు

కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని అమ్మడం ద్వారా ప్రభుత్వం ప్రతియేటా రూ.1.019 కోట్ల ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారని నివేదిక తెలిపింది. అప్పుల రీపేమెంట్ కోసం పరిశ్రమలు, తాగునీరు, ఫిషరీస్ ద్వారా ఆదాయం వస్తుందని చెబుతూ, 15 బ్యాంకుల నుంచి రూ.87 వేల కోట్లను రుణంగా తీసుకునేందుకు ఒప్పందం కుదర్చుకుందని వివరించింది. ప్రస్తుతం ఈ అప్పులు, తీర్చేందుకు కొత్తగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించింది.

ప్రతియేటా రూ.14,462 కోట్ల వడ్డీ

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్కారు రూ.97,449 కోట్లు అప్పుగా తీసుకుందని 'కాగ్' స్పష్టం చేసింది. డిపిఆర్ తర్వాత కూడా మార్పులు చేశారని చెప్పింది. ఒక్కో పనికి అనుమతి ఇస్తూ పోయిందనీ, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ పేరుతో అప్పులు తెచ్చిందని వివరించింది. రూ.87,449 కోట్ల రుణాలు తెచ్చిన సర్కారు, బడ్జెట్ నుంచి కేవలం 27 శాతం మాత్రమే కేటాయింపులు చేసిందని గుర్తు చేసింది. ఒక టిఎంసి నీటితోసాధారణంగా 10 వేల ఎకరాల్లో పంటసాగుచేయవచ్చనీ, కానీ కాళేశ్వరం నీటితో 17,666 ఎకరాల ఆయకట్టు వస్తుందని అప్పటి సర్కారు అంచనా వేసిందని వివరించింది. కాళేశ్వరం పనులకు సంబంధించి 56 పనుల్లో 33 పూర్తయ్యాయనీ, వీటిద్వారా 14లక్షలఎకరాలఆయకట్టు వచ్చిందని చూపించినట్టు కాగ్ పేర్కొంది.

9 ఒప్పందాలు వాయిదా..నిధులు మళ్లింపు

కాళేశ్వరం రుణాల చెల్లింపు వాస్తవానికి 2020-21లో ప్రారంభం కావాల్సి ఉంది. వాటితో తొమ్మిది ఒప్పందాలు వాయిదా వేయాలని కోరిందని కాగ్ చెప్పింది. దీంతో వడ్డీల భారం రూ.8182 కోట్లు అదనంగా పడిందని తెలిపింది. కాళేశ్వరం పేరిట తెచ్చిన రూ.1690 కోట అప్పును వేరే పథకాలకు మళ్లీంచిందని తెలిపింది. ఈ కారణంగా రూ.587 కోట్ల భారం పడిందని వివరించింది.

భూకంపజోన్‌లో మల్లన్నసాగర్

50 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ భూకంప జోన్‌లో ఉన్నట్టు కాగ్ నివేదిక స్పష్టం చేసింది. ఆ ప్రాంతంలో ఎన్‌జిఆర్‌ఐ ప్రాథమిక సర్వేలో డీప్ సీటెడ్ వర్టికల్ ఫాల్ట్ (లోతులో నిటారు పగుళ్లు) ఉన్నట్టుగా తేలిందనీ, ఇక్కడ భూకంపప్రభావంపైఅధ్యయనం చేయకుండానే రూ.6,126.80 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును నిర్మించారని నివేదికలో ఆగ్రహం వ్యక్తం చేసింది.

2036 దాకా బాకీ కట్టాల్సిందే

కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలకు రూ.63,352 కోట్ల నుంచి రూ.1.06 లక్షల కోట్లకు పెంచారని కాగ్ చెప్పింది. ప్రాజెక్టు కోసం భారీగా అప్పులు తీసుకొన్నారన్న కాగ్, వీటిని తీర్చడానికి కొత్తగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. ఈ అప్పు 2036 సంవత్సరం దాకా కట్టాల్సి వస్తుంది. అప్పటిదాకా వడ్డీ చెల్లించాల్సిందేనని నివేదికలో స్పష్టం చేసింది.

రీఇంజినీరింగ్‌తో రూ.765 కోట్లు నష్టం

కాళేశ్వరం వ్యయం భారీగా పెరిగినా అదనపు ప్రయోజనం లేదని కాగ్ పేర్కొంది. రీఇంజినీరింగ్, మార్పుల కారణంగా అప్పటికే చేసిన కొన్ని పనులు నిరర్థకమయ్యాయనీ, దీంతో రూ.765 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపింది. పనుల అప్పగింతలో నీటిపారుదల శాఖ తొందరపాటు ప్రదర్శించింది. డీపీఆర్ ఆమోదానికి ముందే రూ.25 వేల కోట్ల విలువైన 17 పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. అవసరం లేకున్నా మూడో టీఎంసీ పనులు చేపట్టారు. దీంతో రూ.25 వేల కోట్లు అదనంగా ఖర్చయింది. సాగునీటిపై మూలధన వ్యయం ఒక్కో ఎకరానికి రూ.6.42 లక్షలు కాగా, ప్రాజెక్టు ప్రయోజనం,వ్యయ నిష్పత్తి 1.51 శాతంగా అంచనావేశారు. కానీ, అది 0.75 శాతంగా చెబుతున్నది. అది మరింత తగ్గే అవకాశముందని వ్యాఖ్యానించింది.

కాంట్రాక్టర్లకు రూ.2684.73 కోట్ల లబ్ధి

కాళేశ్వరం ప్రాజెక్టులోని 21 ఒప్పందాల పనులకుగాను రూ.8338.04 మెగావాట్ల సామర్థ్యం గల లిఫ్టుల సరఫరా, ఫౌండేషన్ పనులు ఉన్నాయి. సాగునీటిశాఖ మార్కెట్ ధరలను అంచనావేయకుండాఈ పనుల అంచనాల్లో పంపులు,మోటార్లు, వాటి అనుబంధ పరికరాల కోసం రూ.17,653.71 కోట్ల మొత్తాలను చేర్చింది. అందులో నాలుగు పనుల్లో కాంట్రాక్టర్లు వాస్తవంగా పరికరాలను కోనుగోలు చేసిన బీహెచ్‌ఈఎల్ ధరలను ఆడిట్ చేయగా, ఈ పరికరాల కోసం అంచనా వ్యయం రూ.7,212.32 కోట్లు కాగా వాస్తవ ధర రూ.1,686.59కోట్ల కంటే రూ.5,525.75 కోట్లు అధికంగా ఉన్నట్టు తేలింది. బిహెచ్‌ఈఎల్ పరిధిలో లేని పరికరాల కోనుగోలు కోసం అంచనా విలువలో 30 శాతాన్నీ, కాంట్రాక్టర్లు ఇతర ఖర్చుల వ్యయం, లాభం కోసం ఊ. మరో 20 శాఅన్ని అనుమతించినా కూడా ఈపనుల్లో కాంట్రాక్టర్లకు రూ.2,684.73 కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూర్చినట్టు కాగ్ రిపోర్టులో విమర్శించింది.

విద్యుత్ కోసం రూ. 10,374 కోట్లు

కాళేశ్వరానికి ప్రతియేటా విద్యుత్ ఛార్జీల కోసం రూ.10,474.56 కోట్ల మొత్తం అవసరమవుతుందని నివేదిక చెప్పింది. అదనంగా వార్షిక నిర్వహణా ఖర్చు కింద రూ.272.70 కోట్లు కావాలి. మొత్తం రూ.10,647.26 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది ఎకరాకు రూ.46,364గా అవుతుంది. ఆదాయం లేని నేపథ్యంలో ఇదంతా భారమేనని తెలిపింది. కాళేశ్వరం కోసం చేసిన అప్పులకు ప్రతియేటా రూ.14,462.15 కోట్ల మేర వడ్డీలు కట్టాల్సి ఉంటుంది. అప్పులు తీర్చడానికి వచ్చే 14 ఏండ్లల్లో సర్కారుకు లేదా కాళేశ్వరం కార్పొరేషన్‌కు రూ.1,41,544.59 ల కోట్ల నిధులు అవసరమవుతాయి.

మహబూబ్‌నగర్ రైతులను ఆదుకోండి

- ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాలుగు మార్కెట్లలో పల్లి, వేరశనగ రైతులు కనీస మద్దత ధర కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గురువారం శాసనమండలిలో ఆమె రైతుల సమస్యలపై ప్రత్యేక ప్రస్తావన చేశారు. వీటికి కనీస మద్ధతు ధర రూ.6375 ఉండగా సగం మంది రైతులకు రూ.7 వేల నుంచి రూ.10 వేలు వచ్చాయని తెలిపారు. మిగిలిన సగం మంది విషయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి కనీస మద్ధతు ధర కన్నా తక్కువగా రూ.5 వేలకే కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో రైతులు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. కనీస మద్ధతు ధర కన్నా తక్కువగా ఇస్తే రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందనీ, దాన్ని అమలు చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము ధాన్యానికి మాత్రమే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పినట్టు గుర్తు చేశారు. దీంతో కవిత మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్‌లో ప్రతి పంటకూ బోనస్ ఇస్తామని చెప్పారని చేశారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్య పెంచాలి

- బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచాలని బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎం.ఎస్. ప్రభాకర్‌రావు కోరారు. గురువారం శాసనమండలిలో ఆయన ఆహార కల్తీకి సంబంధించి ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ హైదరాబాద్ అమీర్ పేటలోని ఓ సూపర్ మార్కెట్‌లో ఒక వ్యక్తి తన కుమారుని కోసం క్యాడ్ బరీ చాక్లెట్ కొనుగోలు చేస్తే పురుగులు వచ్చాయని ఉదహరించారు. ఇలాంటి వాటితో ప్రజారోగ్యం దెబ్బతింటుందనీ, రెగ్యులర్‌గా నిఘా లేకపోవడంతో ఇలాంటివి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయన తెలిపారు.

మతోన్మాదుల ప్రోద్బలంతోనే దళితులపై మూక దాడి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్
- జన్వాడలో బాధితులకు పరామర్శ

ఆందోళన చేస్తున్న కెవిపిఎస్, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాదుల ప్రోద్బలంతోనే జన్వాడలో దళితులపై మూకదాడి చేసిన బాధ్యులపై ఎస్‌సి, ఎస్‌టి హత్య నేరం కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ చేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలోని జన్వాడ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. అయితే గ్రామంలో 144సెక్షన్ అమల్లో ఉందని వారిని పోలీసులు అడ్డుకున్నారు. దాంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ..రహదారి విషయంలో అగ్గిరాజేసిన మతోన్మాదులు ఒక పథకం ప్రకారం దళితులపైకి బిసిలను ఉసిగొల్పి దాడి చేయించారన్నారు. తక్షణమే పెత్తందారులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొంత కాలంగా భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లు బిసిలలో హిందూత్వ విద్వేషాలు రెచ్చిగొట్టిన ఫలితంగానే మూకుమ్మడిగా 'జైశ్రీరాం' అంటూ రాళ్లు, కర్రలతో దళిత వాడపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో 12మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. దళిత వాడ చర్చి సమీపంలోని కాంపౌండ్ వాల్ విషయంలో పలుమార్లు గ్రామ సర్పంచ్‌కు మొరపెట్టుకున్నారని చెప్పారు. అయినా వినకుండా దాని మీదుగా రోడ్ వేస్తున్న క్రమంలో గ్రామ పెత్తందారులు గౌడిచర్ల నర్సిహ్మా, తలారి మైసయ్య కుమ్మరి శ్రీను, గోపాల్‌తోపాటు సుమారు వంద మంది కలిసి దళితులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ తన భూమి కాపాడు కొని దళితుల భూమిని రోడ్డు కోసం వదిలిపెట్టాలని యత్నించారని, అందుకు దళితులు ఒప్పుకోకపోవడంతో ఈ దాడి జరిగిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. దళితులపె హత్యాయత్నం చేశారని, తక్షణమే నిందితులపై కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామంలో దళితులను పూర్తి రక్షణ కల్పించాలన్నారు. పోలీసు ఉన్నతాధికారులు నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్నారు. దాడి చేసిన వారిని వదిలేసి దళితులపై అక్రమకేసులు బనాయించారని, పరస్పర దాడులు చిత్రీకరించడం సరికాదని అన్నారు. తక్షణమే దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చల్లా శోభన్, జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, నాయకులు రుద్రకుమార్, కృష్ణ, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కారత్, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర వెంకటేష్, సిపిఎం శంకర్‌పల్లి మండల కార్యదర్శి ఏనుగు మల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, శ్రీను, సిఐటియు నాయకులు తదితరులు ఉన్నారు.

IN THE HON'BLE COURT OF THE
II ADDL. DISTRICT JUDGE
AT: SRIKAKULAM
G.W.O.P.2/2023

Between:
Sri Singuru Suresh Kumar ...Petitioner
And:
Smt.Singuru Vasundhara ...Respondent

NOTICE

To, **Respondent**:
Smt. Singuru Vasundhara,
W/o. Singuru Suresh Kumar,
D/o. Pydi Venkata Ramana,
Permanent R/at Kintali Village,
Modavalasa, Ponduru Mandalam,
Srikakulam District.
Presently R/at Flat No.403,
Bheeram Guda, Ameerpet,
Hyderabad-502032.

Please take notice that the above-named petitioner filed the said GWOP.2/2023 against you declaring the petitioner that he is a fit and proper person and to appoint him as natural guardian for the minor child i.e. Singuru Gurpreet and direct you to handover the minor child to the custody of the petitioner. You are hereby required to appear in this Court on **07-03-2024** at **10:30 A.M.** in person or by pleader duly instructed and able to answer all materials questions relating to the above proceedings. Also take notice that in default of your appearance on the afore said day the matter will be settled and the said case heard and determined in your absence.

(By Order)
P. JAI SHANKAR,
Advocate
Visakhapatnam, Cell: **9849577197.**

కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి

- సిఎంకు ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వార్షిక బడ్జెట్‌లో సవరించాలని టిఎస్‌ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సిఎం రేవంత్‌రెడ్డికి వారు లేఖ రాశారు. ఆర్‌టిసి అభివృద్ధి, ప్రజల సౌకర్యాలు, కార్మికుల సంక్షేమం కోసం తగిన విధంగా నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రణాళికలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి కార్మికుల బాధలు, కష్టాల గురించి అసెంబ్లీలో ప్రస్తావించటం అభినందనీయమని తెలిపారు. 2013 వేతన ఒప్పందం సందర్భంగా ఏడేండ్ల కాలపరిమితితో ఇచ్చిన బాండ్ల చెల్లింపునకు రూ.281 కోట్లు విడుదల చేయటం హర్షణీయమని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత రవాణా కల్పించటంతో ప్రయాణీకుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ప్రయాణికుల్లో 60 శాతంకు పైగా మహిళలు ఉంటున్నారని పేర్కొన్నారు 'మహాలక్ష్మికి ముందు మహాలక్ష్మి అమలు తర్వాత' అని చర్చించుకొనేలా ఆర్టీసీ పరిస్థితి వుందని తెలిపారు. ఈ పథకం సంపూర్ణంగా అమలుకావాలంటే ప్రజల అవసరాల మేరకు సర్వీసులు విస్తరించాలని కోరారు.కార్మికుల సామాజిక భద్రతా పథకాలకు భరోసా కల్పించాలని కోరారు. కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులాలన్నీ ఒకే గొడుగు కిందకు

- ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల పిల్లలు ఒకే చోట చదువుకునేలా ఏర్పాట్లు
- 20 ఎకరాల్లో కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టు
- 70 రోజుల్లోనే 25 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గురుకుల టీచర్లకు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ విద్యార్థులు చదువుకునేందుకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. మరి వాటిల్లో కనీస మౌలిక వసతుల్లేక.. ఆడపిల్లలు అవస్థలు పడుతుంటే కంటికి కనిపించలేదా? వందలాది ఆడబిడ్డలు టాయిలెట్లు లేక లైన్‌లో ఉండి వెళ్తున్న దుస్థితి కనిపించలేదా? మన బిడ్డలో.. మన అక్కో.. చెల్లో అలా ఇబ్బంది పడితే చూస్తూ ఊరుకుంటామా? వారి కోసం వసతులు ఏర్పాటు చేయాలన్న బాధ్యత ప్రభుత్వాలపై లేదా? రూ. లక్షల కోట్ల బడ్జెట్ కలిగిన మిగులు రాష్ట్రమైన తెలంగాణలో పదేండ్ల కాలంలో రూ.15.5లక్షల కోట్లు కెసిఆర్ చేతికి వచ్చినా ఎందుకు ఆ పిల్లలకు వసతులు ఏర్పాటు చేయలేదు' అని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకే గురుకుల పాఠశాలలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొస్తామని చెప్పారు. 20 ఎకరాల్లో ఒకే క్యాంపస్‌లో అన్ని రకాల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, కొడంగల్‌లో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని చెప్పారు. "ఈ మోడల్‌ను అన్ని నియోజకవర్గాల్లో ఆచరణలోకి తీసుకొస్తాం. ఇందుకు కావాల్సిన స్థలాలను సేకరించాలని వేదికపై నుంచే అధికారులను ఆదేశిస్తున్నా' అని అన్నారు. కొత్తగా నియామకమైన ప్రభుత్వ గురుకులాల ఉపాధ్యాయులకు (పీజీటీలు, పీడీలు, లైబ్రేరియన్లు) నియామక పత్రాలను గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎస్ శాంతి కుమారితో కలిసి సీఎం అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాల విషయంలో పదేండ్లు బిఆర్‌ఎస్ నిర్లక్ష్యం వహించిందన్నారు. 'త్వరలోనే గ్రూప్-1 పరీక్ష నిర్వహిస్తాం. 3,650 రోజులు అధికారంలో ఉండి మీరు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదు. తమ ప్రభుత్వం ఏర్పడిన 70 రోజుల్లో 25వేల ఉద్యోగాల నియామకాలు చేపట్టాం.. మీరు ఉరితాళ్లు కట్టుకుని వేలాడినా.. ఇంకేం చేసినా.. ప్రజలు మీపై సానుభూతి చూపరని" అన్నారు. రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 1971లో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పివి నరసింహారావు సర్వైల్‌లో గురుకుల పాఠశాలను ప్రారంభించారని, ఆ గురుకులంలో నుంచి వచ్చిన బుర్ర వెంకటేశం, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ వంటి ఎంతో మంది ఐఎఎస్, ఐపిఎస్‌లతో పాటు విదేశాల్లోనూ ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. అప్పట్లో 32 ఉంటే.. ఇప్పుడు రాష్ట్రంలో 1022 ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకులాలు ఉన్నాయన్నారు. ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామన్నారు. తమ ప్రభుత్వానికి అండగా ఉండాలని, కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే 25 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. పనిచేసే ప్రభుత్వం అని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత జాతరగా మేడారం

పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారంను ప్లాస్టిక్ రహిత జాతరగా నిర్వహించాని పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులకు సూచించారు. గురువారం మలుగు జిల్లా మేడారంలోని హరిత హోటల్ సమావేశం మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతర సమయం దగ్గర పడుతున్న తరుణంలో సందర్శకుల తాకిడి పెరుగుతోందన్నారు. ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చూడాలన్నారు. నిరంతరం తాగు నీరు అందించాలని చెప్పారు. జాతర ముగిసిన అనంతరం కూడా ముమ్మరంగా పారిశుధ్య పనులు కొనసాగించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మాట్లాడుతూ.. జాతరలో గద్దెల ప్రాంగణంలో బెల్లం, కొబ్బరికాయలు శుభ్రం చేయాలని, జంపన్న వాగు సమీపంలో తలనీలాలు కూడా శుభ్రం చేయాలని అన్నారు. మిషనరీ యంత్రాల ద్వారా పారిశుధ్య సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ త్రిపాఠి మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి జాతర విధులకు వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా 19 తేదీన సంబంధిత జోనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని చెప్పారు. జాతరలో పారిశుధ్య పనులు చేయడం కోసం 10 సెక్టార్లు, 60 సబ్ సెక్టార్స్‌గా విభజించామని, డిపిఒ, డిఎల్‌పిఒల ఆధ్వర్యంలో పనులు జరుగుతాయని అన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ.. అధికారులకు కేటాయించిన జోన్‌లలో విధులు నిర్వహించాలన్నారు. ప్రతి జోన్‌కు ఎంపిఒ స్థాయి అధికారిని కేటాయించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి శబరిష్, డిపిఒలు, డిఎల్‌పిఒ, వివిధ జిల్లాల జోనల్ అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF HONOUBLE
III ADDL. SENIOR CIVIL JUDGE:
CITY CIVIL COURTS: AT
SECUNDERABAD
O.S.NO. 15 OF 2024

BETWEEN:
Md.Zakhiuddin Ansari
&others ...Plaintiffs
AND
The Thasildhar & another ...Defendants

To
All Concern(Defendant No.2)

NOTICE

take notice that the Plaintiffs filed the above suit for declaration to declare them as legal heris of deceased mohammed Mazheruddin Ansari to succeed his estate i.e. Suit Schedule Property bearing Residential Plot No. 41 and Constructed House No. **1-288/41** New House No. **12.13-689 ZP** thereupon admeasuring 200 sq. Yards or **167.226 Sq.**Meters in Survey No. 160, Situated at Madhuranagar Housing Colony, Tarnaka,Lallaguda village under Zilla Parishad Taluk, Hyderabad District at present Secunderabad bounded by **NORTH** Plot No.**41-A; SOUTH: Plot No. 42; EAST:** approved 40 feet wide Road; **WEST :** Plot No. 38 against you and another and the same is posted to **05/03/2024.** That if any person/s have any objection, such person/s may appear on **05/03/2024 at 10:30 AM** before the above Hon'ble Court either in person or through Advocate, otherwise, the matter will be decided in your absence.

By order of the Hon'ble Court
DESHAM JAIPAL REDDY
Advocates
H.No. 8-4-42, Pavnpuri Colony,
Kharmanghat, Hyderabad
Phone No. 9912651234
COUNSEL FOR PLAINTIFFS

పరిశోధనల్లో తగ్గిన ప్రామాణికత

- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ ఎన్.గోపీ
- సాహిత్యం మానవీయతను బోధిస్తుంది : లింబాద్రి
- ఓయులో ఘనంగా తెలుగు తొలి సాహిత్య మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో సెల్‌ఫోన్ రాకతో చాలా మందిలో అధ్యయనా లోపంతో నాలెడ్జ్ తగ్గిపోతోందని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ విసి ప్రొ.ఎన్.గోపీ అన్నారు. హిస్టరీ కాంగ్రెస్, సైన్స్ కాంగ్రెస్ వలె, తెలుగు లిటరరీ కాంగ్రెస్ నేటి చారిత్రక అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నిర్వహించిన సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు లిటరరీ కాంగ్రెస్-2024 కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన ఈ సదస్సులో తెలుగు భాషా సాహిత్యాల మీద విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రొ.ఎన్ గోపి మాట్లాడుతూ.. సాహిత్య పరిశోధనల మీద విలువైన అభిప్రాయాలు తెలియజేశారు. గతంలో మూల గ్రంథాలను అధ్యయనం చేసి పరిశోధన చేసేవారని, కానీ నేడు పరిశోధనలో ప్రామాణికత తగ్గిపోయిందన్నారు. వేమన మీద పరిశోధన చేయాలంటే తాళపత్రాలను చదివి పద్యాలను ఎత్తి రాసుకునేవాళ్లం.. ఫలితంగా జ్ఞాన ప్రసారం జరిగిందన్నారు. పుస్తకాన్ని ముట్టుకుంటేనే దాని తత్వం అర్థమవుతుందని చెప్పారు. తెలుగు భాషను సాహిత్యాన్ని విస్తరించాలంటే అధ్యయన సంస్కృతిని పెంచాలన్నారు. విశ్వవిద్యాలయాలు జ్ఞానానికి నిలయాలుగా ఉన్నప్పుడే సమాజ నిర్మాణం ప్రగతిదాయకంగా ఉంటుందని చెప్పారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి మాట్లాడుతూ... ఏ శాస్త్రాలను బోధించని మానవీయతను సాహిత్యం బోధిస్తుందని, సాహిత్యం చదివితే సమాజం సున్నితంగా మారుతుందని అన్నారు. సామాజిక శాస్త్రం విద్యార్థిగా సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ఆసక్తిగా ఉంటుందన్నారు. తెలుగు టీచర్స్ ఎంతో ప్రేరణ కలిగిస్తారని, సమాజాన్ని ప్రభావితం చేస్తారని చెప్పారు. గద్దర్ పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిందన్నారు. వేమన పద్యాలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయని, టిఎల్‌ఎస్ ఏర్పాటు హర్షణీయం అన్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... భాషా సాహిత్యాలను అధ్యయనం చేయడం వల్ల ఉపాధి కూడా పొందే అవకాశం ఉండాలని, అప్పుడే సాహిత్యం చదివే వారి సంఖ్య పెరుగుతుందని అన్నారు. భాషా సాహిత్యాలలో సృజనాత్మకత పెరగాలంటే విశ్వవిద్యాలయాల కృషి ఎక్కువగా ఉండాలని చెప్పారు. ఆంగ్ల భాషకు సమానార్థాలు కలిగిన పదాలను సృష్టించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. తెలుగు భాష సాహిత్య విస్తృతి పెరగాలంటే విడివిడి వ్యక్తులందరూ ఒక సమూహంగా ఏర్పడాలని కోరారు. తెలుగు విశ్వవిద్యాలయం విసి ప్రొ.కిషన్‌రావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ మాట్లాడారు. తెలుగు లిటరరీ కాంగ్రెస్ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించిన ఓయు తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొ.చింతకింది కాశీం ఈ ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, వివిధ సాహిత్య సంస్థలు కలిసి ఒకే వేదికగా ఏర్పడాలని కాశీం ఆకాంక్షించారు. అందుకోసమే హిస్టరీ కాంగ్రెస్ సైన్స్ కాంగ్రెస్ వలె తెలుగు లిటరరీ కాంగ్రెస్ ఏర్పడాలన్న లక్ష్యం ఈ సదస్సుకు ఉందని చెప్పారు. 100 ఏళ్ల విభాగం ప్రగతిని వివరించారు. సాహిత్యం సమాజ ప్రతిబింబం అని, డిగ్రీ 3వ, సంవత్సరం కవిత్వం, నవలలు, సాహిత్యం రాయడంపై సిలబస్ రూపొందించామన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సూచన ప్రోత్సాహంతోనే టిఎల్‌ఎస్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు శాఖల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు. అదేవిధంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, పాఠశాల తెలుగు టీచర్లు, తెలుగు విభాగం ప్రొపెసర్స్ ప్రొ.ఎస్.కమలాకర శర్మ, ప్రొ.సూర్యదనుంజయ్, డా.విజయలక్ష్మి, డా.ఎస్.రఘు, తెలుగు శాఖ ఎం.ఎ విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

CONCORD DRUGS LIMITED
Regd. Office:Survey No.249, Brahmanapally Village, Hayatnagar Mandal-501511 Telangana
Contact no.: +91 9052779505, Email Id: info.:csconcorddrugs@gmail.com, Website: www. concorddrugs.in

EXTRACT OF THE UNAUDITED CONSOLIDATED RESULTS FOR THE QUARTER ENDED 31-1-2023
(Rs in Lakhs)

S. No.	Particulars	Quarter Ended 31-12-2023 (Un Audited)	Corresponding 3 months ended 31-12-2022 (Un Audited)	Year ended 31-03-2023 (Audited)
1.	Total Income from Operations	1,278.37	1,352.83	5,208.94
2.	Total Expenses	1,304.06	1,291.23	5,084.05
3.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and/or extraordinary items)	(25.69)	61.60	124,89
4.	Net Profit / (Loss) for the period before tax (after Exceptional and/or extraordinary items)	(25.69)	61.60	124,89
5.	Net Profit / (Loss) for the period after tax (after Exceptional and/or extraordinary items)	(24.12)	45.43	98.55
6.	Total Comprehensive Income for the period [Comprising Profit/ (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	(24.12)	45.43	98.55
7.	Paid up Equity Share Capital (Face Value INR 10/- each)	1,000.00	874.38	931.55
8.	Earnings Per Share (for continuing and discontinued operations) - 1. Basic: 2. Diluted:	-0.24 -0.24	0.52 0.52	1.06 1.06

Note: 1. The above is an extract of the detailed format of Quarterly Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The standalone audited quarterly results are Turnover Rs 1,262.440 Lakhs , Profit before tax is Rs (25.513) Lakhs & Profit after tax is Rs (23.946) Lakhs .The full format of the Quarterly Results are available on the websites of the Stock Exchange and the Company's website (www.concorddrugs.in).
b) The above Unaudited Standalone & Consolidated Financial results after Limited Review Report by the statutory auditors of the company were approved by the Board of directors in the meeting held on 13.02.2024.

Place: Hyderabad
Date:-13-02-2024
For Concord Drugs Limited
Sd/- S. Nagi Reddy, Chairman & Managing Director, (DIN: 01764665)

మేడిగడ్డపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- కెఆర్ఎంబిపై అఖిలపక్షం పెట్టాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడిగడ్డ ప్రాజెక్టులో పిల్లర్లు కుంగడంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కెఆర్ఎంబిపై తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులను కేటాయించాలన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును బొందల గడ్డగా మార్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నల్లగొండ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు అయ్యాయని, గత ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులకు మాత్రమే శంకుస్థాపనలు చేసిందని, కొత్తగా ఏ ఒక్కటీ మంజూరు చేయలేదని చెప్పారు. నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో గత బిఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కెసిఆర్ పాలనలో రైతాంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. వాస్తవానికి కెసిఆర్ నల్లగొండ బహిరంగ సభకు వచ్చేటప్పుడు జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పి రావాల్సిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అసెంబ్లీ సమావేశాలు సజావుగా సాగలేదని, ప్రతిపక్ష నాయకులకు సమయం ఇవ్వకుండా సమావేశాలు నిర్వహించారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ, ప్రజల సమస్యలపై చర్చలు నిర్వహించకుండా రచ్చబండగా చేశారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు హుందాగా నడవాలని సూచించారు.

దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని బిజెపి కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే అయోధ్యలోని రామ మందిరాన్ని ముందుకు తెచ్చి దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేస్తూ ప్రజలను సెంటిమెంట్‌తో మోసం చేయాలని చూస్తోందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2015లో శంకుస్థాపన చేసిన చర్లగూడెం రిజర్వాయర్‌కు సంబంధించి కనీసం భూ నిర్వాసితులకు కూడా పూర్తి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. డిండి ఎత్తిపోతల పథకానికి ఎక్కడి నుంచి నీరు తీసుకోవాలో కనీసం డిపిఆర్ కూడా ప్రభుత్వాలు రూపొందించ లేదన్నారు. ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టానని ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప గత పది సంవత్సరాల కాలంలో జిల్లాలో ఒక్క ఎకరానికీ కొత్తగా సాగునీరు ఇవ్వలేకపోయారని తెలిపారు. కెసిఆర్ నిన్న జరిగిన బహిరంగ సభలో శుద్ధ అబద్ధాలు మాట్లారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బికార్ మల్లేష్, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, పాలడుగు ప్రభావతి, కందాల ప్రమీల, చిన్నపాక లక్ష్మీనారాయణ ఉన్నారు.

అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నందికొండలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- నూతన చైర్మన్ ఎన్నిక లాంఛనమే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా బిఆర్ఎస్ చీలిక వర్గం, కాంగ్రెస్ కౌన్సిలర్లు మొత్తం తొమ్మిది మంది ఓటేశారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ణ అనూష శరత్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంద రఘువీర్ (బిన్నీ) పదవులు కోల్పోయారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన ఆర్‌డిఒ చెన్నయ్య ఆధ్వర్యంలో 9వ వార్డు కౌన్సిలర్ ఈర్ల రామకృష్ణ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించగా మిగతా ఎనిమిది మంది సభ్యులు ఆమోదించారు. మున్సిపాలిటీలో 11 మంది సభ్యులు ఉండగా.. తొమ్మిది మంది సభ్యులు ఏకతాటిపై ఉండటంతో చైర్‌పర్సన్‌కు పదవీ గండం తప్పలేదు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మొత్తం తొమ్మిది మంది మంది కౌన్సిలర్లు చేతులు పైకెత్తడంతో, తీర్మానం నెగ్గిందని ధ్రువీకరించారు. కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు తేదీ ప్రకటిస్తామని తెలిపారు. మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు చెందినవారే తదుపరి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

వెబ్‌సైట్‌లో టిసిసి పరీక్షల హాల్‌టికెట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టిసిసి) పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 వరకు జరుగుతాయని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టిసిసి పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. జిల్లా పేరు, ట్రేడ్ కోడ్, ట్రేడ్ పేరు, అభ్యర్థి పేరు, పుట్టిన తేదీ వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఒ)లను సంప్రదించాలని కోరారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు డ్రాయింగ్ (లోయర్ గ్రేడ్), డ్రాయింగ్ (హయ్యర్ గ్రేడ్) విద్యార్థులకు పరీక్షలను నిర్వహిస్తారు. ఈనెల 25న టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ (లోయర్‌గ్రేడ్) విద్యార్థులకు, 26,27 తేదీల్లో టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ (హయ్యర్ గ్రేడ్) విద్యార్థులకు పరీక్షలుంటాయి.

జెపిఎస్ పోస్టులు భర్తీ చేయాలి

- మంత్రి సీతక్కకు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్

స్పోర్ట్స్ కోటాలో నిర్వహించిన పరీక్షా ఫలితాలను వెంటనే ప్రకటించాలని, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జెపిఎస్) పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి అనసూయ (సీతక్క)కు గురువారం ఆయన లేఖ రాశారు. స్పోర్ట్స్ కోటాలో జెపిఎస్ పోస్టుల భర్తీకి రెండేండ్ల క్రితం నిర్వహించిన పరీక్షా ఫలితాలను ప్రకటించి, వారికి ఉద్యోగాలివ్వాలని కోరారు. ఉద్యోగాల భర్తీలో రెండు శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2012, ఆగస్టు తొమ్మిదిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిఒఎంఎస్ నెంబర్ 74ను జారీ చేసిందని గుర్తు చేశారు. దాని ప్రకారం రాష్ట్రంలో మిగిలి ఉన్న 172 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీకోసం 2021, సెప్టెంబర్ ఆరున గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌ను జారీ చేసిందని తెలిపారు. రాతపరీక్షను అదే ఏడాది డిసెంబర్ 21న నిర్వహించిందని పేర్కొన్నారు. పరీక్ష రాసి రెండేండ్లు గడుస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం నేటికీ వాటి ఫలితాలను వెల్లడించలేదని తెలిపారు. దీంతో పరీక్ష రాసి, ఉద్యోగం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న అభ్యర్థులు నిరాశా, నిస్పృహలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సర్పంచ్‌ల కాలపరిమితి ముగిసిందని వివరించారు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో మెరుగైన సేవలు ఎంతో అవసరమని సూచించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో నిర్వహించిన పరీక్ష ఫలితాలను వెంటనే ప్రకటించి, జెపిఎస్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు.

గుండెపోటుతో ఆర్‌టిసి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాలు ప్రకారం.. వేంసూరు మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన కాకాని శ్రీనివాసరావు (45) గురువారం ఉదయం ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవింగ్ చేస్తున్నారు. బస్సు సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తుండగా ఆయనకు గుండె నొప్పి వస్తుందని కల్లూరు పాత బస్టాండ్ వద్ద ఆపాడు. వెంటనే నడుచుకుంటూ స్థానిక ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షిస్తున్న సమయంలో మృతిచెందాడు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు

కబ్జాలపై హైకోర్టు కమిషన్ సభ్యుల పర్యటన

- చెరువుల ప్రత్యక్ష పరిశీలన
- అన్యాక్రాంతంపై హైకోర్టుకు నివేదిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని చెరువులు, కుంటల అన్యాక్రాంతంపై గతంలో నమోదైన కేసులకు సంబంధించి ఏర్పాటైన కమిషన్ సభ్యులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, రెవెన్యూ ప్రభుత్వ ప్లీడర్ టి శ్రీకాంత్ రెడ్డి ఇతర సభ్యులు, అధికారులు గురువారం చెరువులను పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండల పరిధిలోని దుర్గంచెరువు, సున్నం చెరువు, మేడికుంట, గోసాయి కుంట, పెద్ద చెరువు, గంగారం పెద్ద చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల ఆక్రమణలు, వాటి స్థితిగతులకు సంబంధించి మూడు వారాల వ్యవధిలో సీల్డ్ కవర్‌లో నివేదికను కోర్టుకు సమర్పించనున్నారు. కమిషన్ సభ్యుల వెంట రంగారెడ్డి జిల్లా భూ పరిరక్షణ తహసీల్దార్ డి శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, రాజేంద్రనగర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటేష్, శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్ జి శంకర్, శేరిలింగంపల్లి మండల సర్వేయర్ ఎస్ మహేష్, ఆర్ ఐలు శ్రీను, రాంబాబు, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నార్త్ ట్యాంక్ డివిజన్, నీటిపారుదల శాఖ నారాయణ, చందానగర్ డిసి వంశీకృష్ణ, డిఇ నళిని, ఎఇ నాగరాజు, డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్, జిహెచ్ఎంసి అధికారులు ఉన్నారు.

సాహిత్య చరిత్ర వెనుకబడిన తరగతులదే

- శ్రీనివాస్‌తో ముఖాముఖి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విస్తృత సాహిత్య చరిత్ర అంతా వెనుకబడిన దళిత, మైనారిటీ, బిసి తరగతులదేనని, ఇందుకోసం కొత్త చరిత్ర రచనకు పరిశోధనలు కొనసాగిస్తున్నామని చరిత్ర పరిశోధకుడు శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికపై ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత ప్రముఖ సాహితీ విమర్శకుడు శ్రీనివాస్‌తో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాహిత్య విమర్శకు పరిశోధన ప్రాణమని, పరిశోధనల లోతు తెలియకపోతే సమర్థవంతమైన విమర్శ బయటకు రాదని తెలిపారు. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన సాహిత్యాన్ని తెలంగాణ సాహితీవేత్తలే వెలుగులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. త్వరలో బిసి సాహిత్య చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, ప్రముఖ కవి ఉడారి నారాయణ, గుడిపల్లి నిరంజన్, రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-2024 షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బిటిఇటి) కార్యదర్శి, పాలిసెట్ కన్వీనర్ పుల్లయ్య గురువారం విడుదల చేశారు. పదో తరగతి, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. గురువారం నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. చివరి తేది ఏప్రిల్ 22 వరకు ఉందని పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.100తో అదే నెల 24 వరకు, రూ.300తో 26 వరకు సమర్పణకు అవకాశముందని వివరించారు. పాలిసెట్ దరఖాస్తు ఫీజు ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఇతరులు రూ.500 చెల్లించాలని కోరారు. పాలిసెట్ రాతపరీక్షను మే 17న నిర్వహిస్తా మని, తర్వాత 12 రోజులకు ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను, సందేహాల కోసం 040-23222192 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అత్యాశే కొంపముంచుతోంది

- సైబర్ నేరస్తుల నుంచి అప్రమత్తతే ఆయుధం
- గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే ఉపయోగం
- సైబర్‌క్రైమ్ నేరాలపై జాయింట్ సిపి అవగాహన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పూర్వం గ్రామ శివార్లలో దారి దోపిడీలు జరిగేవి.. ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, బంగారు, వెండి ఆభరణాలు, విలువైె వస్తువులు ఎత్తుకెళ్లేవారు.. కానీ, హైటెక్ యుగంలో ఒకరికి తెలియకుండా ఒకరు చేతులారా కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ఐటీ ఉద్యోగులు, ఉన్నత స్థానంలో ఉన్నవారితో పాటు వ్యాపారులు, సినీ ప్రముఖులు ఇలా వారు వీరనే తేడా లేకుండా సైబర్ నేరస్తులకు చిక్కి మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సైబర్ నేరాలపై నగర సిసిఎస్‌లో ప్రతి రోజూ 15కు పైగా కేసులు నమోదవుతున్నాయి. బాధితులు కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరాల నివారణకు జాయింట్ సిపి ఎవి రంగనాథ్ ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కసరత్తు మొదలు పెట్టారు. గురువారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్ లో సైబర్ క్రైమ్‌లపై మీడియాకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి కవితతో కలిసి రంగనాథ్ పలుసూచనలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది అత్యాశకు పోయి సైబర్ నేరస్తుల భారిన పడుతున్నారని తెలిపారు. ముందు జాగ్రత్తతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని చెప్పారు. బాగా చదువుకున్న వారు సైతం మోసపోవడం ఆందోళనకరమన్నారు. కోరియర్, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, బిట్‌కాయిన్ కొనుగోలు, కెవైసి నింపాలని, గిఫ్టులు వచ్చాయని వాటిని తీసుకోవాలంటే పన్నులు చెల్లించాలంటూ సైబర్ నేరస్తులు అందినకాడికి దండుకుంటున్నారని తెలిపారు. నకిలీ వెబ్‌సైట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి మోసాలు సైతం పెరిగాయన్నారు. ఇలాంటి మోసాలు గుజరాత్, హరియాణ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జరుగుతున్నాయని వివరించారు. మోసపోయినట్టు గుర్తిస్తే (రెండు మూడు గంటల్లోనే) వెంటనే '1930'కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంతమంచిదని అభిప్రాయపడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింక్‌లను క్లిక్‌లు చేయొద్దని, ఫ్రెండ్ రిక్వెస్టులు, వాట్సాప్ చాటింగ్‌లు, వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్స్ చేయకపోవడమే మంచిదని చెప్పారు. వీడియోకాల్స్ లిఫ్ట్ చేయొద్దని కోరారు. సైబర్ ఫ్రాడ్స్‌ను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రచార మాధ్యమాలు, సోషల్ మీడియా, సినిమాలు, వాల్‌పోస్టర్లు, సైన్‌బోర్డ్స్ తదితర మార్గాల ద్వారా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ఐటీ నిపుణులు, బ్యాంక్ అధికారులు, ఏజెన్సీల ద్వారా క్యాంపెయినింగ్ చేస్తామన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిల్లో ప్రతి రోజూ వేలాది కోట్లను కొల్లగొడుతున్నారు. షాపింగ్‌మాల్స్, ఆన్‌లైన్ షాపింగ్, ఫేస్‌బుక్ ఇతరాత్ర మార్గాల నుంచి డేటా సేకరిస్తున్న సైబర్ నేరస్తులు మాయమాటలతో బోల్తా కొట్టిస్తున్నారు. కార్యక్రమంలో ఎసిపిలు శివమారుతీ, చాంద్‌పాషా, సిఐలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ సిపి రంగనాథ్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

కెసిఆర్‌ను ఎన్నికల కమిషన్ బహిష్కరించాలి

- సిఎంగా రేవంత్‌ని చూడలేకే అసెంబ్లీకి రావట్లేదా
- అహంభావం మంచిది కాదు : నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీకి హాజరుకాని మాజీ సిఎం కెసిఆర్ ఎందుకు పోటీ చేయాలని, అలాంటి వారిని ఎన్నికల కమిషన్ వెంటనే బహిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభకు ఎన్నికైన తరువాత ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా శాసనసభ సమావేశాలను బహిష్కరించిన జయలలిత, జగన్, చంద్రబాబును కెసిఆర్ కాపీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్‌ను అసెంబ్లీ నుంచి గెంటేయించిన కెసిఆర్ ఇప్పుడు ముఖ్యమంత్రి కావడంతో ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి హాజరు కావడంలేదేమోనన్నారు.

నల్ల చొక్కాతో నారాయణ నిరసన

ఢిల్లీలో రైతులపై కేంద్ర ప్రభుత్వం అమానుష దౌర్జన్యాన్ని నిరసిస్తూ నారాయణ నల్ల చొక్కా ధరించి సమావేశంలో హాజరయ్యారు. కేంద్రంలో ఉన్నది రైతు విద్రోహ ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులేమైనా టెర్రరిస్టులా? వాళ్లపై డ్రోన్‌లతో బాష్పవాయువు చల్లడమే మిటని ప్రశ్నించారు. రైతులు ఉద్యమిస్తుంటే మోడీ విదేశాలకు వెళ్లి రామాలయాలు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్‌లను రద్దు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం మేడిగడ్డ వద్దకు మార్చడంతో ఆదిలాబాద్‌కు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా సిఎం ఎ రేవంత్‌రెడ్డి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలని, ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా వచ్చేలా కృషి చేయాలని కోరారు.

భూ'గర్భ శోక'ం

- అడుగంటుతున్న జలాలు
- వర్షాభావానికి తోడు తీవ్రమైన ఎండలు
- 10 మీటర్లకు పైగా పడిపోయిన నీటిమట్టం
- సాగర్‌లో నీరు లేక కృష్ణా పరివాహకంలో ఆందోళన
- ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామంటున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐదారు నెలలుగా చినుకు రాలకపోవడంతో రాష్ట్రంలో పలుచోట్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితులకు తోడు ఫిబ్రవరి నెల నుంచే ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ నీటిమట్టం పడిపోతోంది. ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో తాగునీటి కష్టాలు తప్పేలా లేదు. ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు తగ్గుతుండడంతో బావులలో నీరు ఉండటం లేదు. పలుచోట్ల నెర్రలు బారిన పొలాలు పశువుల మేతగా మారాయి. పది మీటర్లకుపైగా భూగర్భ నీటిమట్టం పడిపోవడం కూడా ఈ ఆందోళనకు కారణ మైంది. గతేడాది ఫిబ్రవరితో పోల్చుకుంటే భూగర్భ జలాల్లో మూడు మీటర్లకుపైగా వ్యత్యాసం ఉంది. ప్రాజెక్టులు, చెరువులు, బావుల్లో నీటిమట్టం అడుగంటుతుండటం యాసంగి పంటలపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య తీవ్రతను అర్థం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రానికి ఆదరువుగా ఉన్న కృష్ణా, గోదావరి పరివాహంలో నీటి వెతలు నెలకొన్నాయి. గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. శ్రీరాంసాగర్ నుంచి కూడా నీరు రావట్లేదు. ఇటు కృష్ణా నదిలోనూ నీరు అడుగంటడంతో నాగార్జున సాగర్ ఆయకట్టూ ఎండుతోంది. కృష్ణా, గోదావరిని అనుసంధానం చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు నీరందించేందుకు 2016లో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం 2019 నాటికి పూర్తి కావాల్సి ఉండగా నేటికీ నిర్మాణ దశలోనే ఉంది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 3.50 లక్షల బోరు బావులున్నాయి. వీటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2వేల వరకు చెరువులున్నాయి. ఎండల తీవ్రతకు నీరు అడుగంటడంతో తాగునీటి కష్టాలు చుట్టుముట్టుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఎడమ కాల్వ పరిధిలో మూడు లక్షలా 94 వేలా 285 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం ఉంది. ఇందులో 3,03,350 ఎకరాలు సాగునీటిపై ఆధారపడి ఆయకట్టు ఉండగా 41 ఎత్తిపోతల పథకం కింద 90,922 ఎకరాలు ఆయకట్టు ఉంది. ఈ సీజన్లో తీవ్ర వర్షాభావం కారణంగా సాగునీరు విడుదల కాకపోవడంతో ఆయకట్టులో 30 శాతం బోర్లు బావుల కింద సుమారు1.20 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. సకాలంలో నీరు అందితేనే పంట చేతికి వస్తుంది. లేకపోతే పంట ఎండిపోయే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. పెట్టిన వేలాది రూపాయలు పెట్టుబడులు వృథా అవుతాయని రైతులు ఆందోళనగా ఉన్నారు.

రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. గతేడాది కంటే 12 మీటర్ల లోతులోకి జలాలు పడిపోయాయి. వేసవి కాలం ప్రారంభానికి ముందే జనవరి నెలలో అర్బన్ ప్రాంతమైన శేరిలింగంపల్లిలో 30 మీటర్ల లోతులోకి వాటర్ లెవల్స్ పడిపోయాయి. తలకొండపల్లిలో 16.86 మీటర్లు, ఇబ్రహీంపట్నం 14.55 మీటర్లు, హయత్‌నగర్ 13.77 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో భూగర్భ జలమట్టం భారీగా పడిపోయింది. మండలంలో 40.05 మీటర్లలోతులో నీరు ఉంది. వ్యవసాయ బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చింది. చివరికి పశువుల మేతకు సైతం ఇబ్బంది ఏర్పడే పరిస్థితులున్నాయి. మండలంలో 70 శాతం బోర్లు మూలన పడ్డాయి. జిల్లావ్యాప్తంగా 2,860 చెరువులు, కుంటలు ఉండగా ఒకటి, రెండింటిలోనే కొద్దిపాటి నీరు ఉంది.

ఖమ్మం జిల్లాలో గతేడాది జనవరితో పోల్చితే ఈ ఏడాది ఒక మీటర్ లోతుకు భూగర్భ నీటిమట్టం పడిపోయింది. జనవరి నాటికి సాధారణ వర్షపాతం 956.9 మి.మీ కురవాల్సి ఉండగా కేవలం 854.4 మి.మీ మాత్రమే నమోదైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఐదు జిల్లాల్లో తొమ్మిది మిల్లీమీటర్ల కనిష్ట స్థాయికి భూగర్భజలాలు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో సగటు భూగర్భ నీటిమట్టాలు 7.35 మీటర్లు ఉండగా ఈ ఏడాది జనవరి చివరి నాటికి 9.71 మీటర్లకు తగ్గాయి. జిల్లాలోని కంది, చౌటకూరు మండలలాల్లో 11.50 మీటర్లకు పైగా నీటిమట్టం పడిపోయింది. సిరిసిల్ల జిల్లాలో మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.5 టిఎంసిలు ఉండగా ప్రస్తుతం 16 అడుగుల టిఎంసిల లోపే నీటిమట్టం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా అన్నపూర్ణ ప్రాజెక్టులోకి నీరు ఎత్తిపోయాల్సి ఉంది. 3.50 టిఎంసిల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో నీటిని రంగనాయక సాగర్‌కు మళ్లించడంతో ఒక టిఎంసి కూడా లేకపోవడంతో ప్రాజెక్టు అడుగంటిపోయింది.

పాలేరు జలాశయంలో నీరు లేకపోవడంతో పాత కాలువ పరిధిలో ఎనిమిది వేల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ తాగునీటి పథకానికి సైతం సరిపడా నీరందే పరిస్థితి లేదు. ఇటీవల సాగర్ నీరు వదిలినా నెలల తరబడి వర్షాభావం, ఎగువ రైతుల మోటార్లతో నీరు వాడుకోవడం వంటి కారణాలతో ఫిబ్రవరి 2, 3 తేదీల నాటికి కానీ నీరు జలాశయానికి చేరలేదు. పాలేరు నీటిమట్టం 23 అడుగులకుగాను 11 అడుగుల వరకు పడిపోయింది. పాలేరు నీటి ఆధారంగా ఎన్ఎస్‌పి పరిధిలో లక్ష ఎకరాలకు పైగా రబీ పంటలు సాగు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని, గోదావరి నీటిమట్టం అడుగంటడంతో అక్కడి పంటల పరిస్థితి కూడా ప్రశ్నార్థకంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగి ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా సాగవుతుంది. జూరాల ప్రాజెక్టు కింద ప్రతియేటా 40 వేల ఎకరాల వరి సాగు చేసేవారు. ఈ ఏడాది రబీలో పదివేల ఎకరాలు కూడా సాగు కాలేదు. కెఎల్ఐ ద్వారా కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు వరి, మొక్క, మిర్చి, వేరుశనగ వంటి పంటలు లక్ష ఎకరాలకు పైగా సాగయ్యేది. ఈసారి 25 వేల ఎకరాలకు మించి సాగు కాలేదు. ఉమ్మడి జిల్లాలోని శ్రీశైలం, జూరాల రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి. జూరాలలో 1045 అడుగులు ఉండాల్సిన నీటిమట్టం 345 అడుగులు మాత్రమే ఉంది. శ్రీశైలంలో గతేడాది ఈ సమయానికి 885 అడుగుల నీరుండగా ఇప్పుడు 301 అడుగులకు పడిపోయింది. నారాయణపేట, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో ఉండే సాగు భూములు బీళ్లుగా మారాయి. ఎటువంటి సాగు వనరులు లేని ఈ రెండు జిల్లాల్లో రబీ సాగు కనిష్ట స్థాయికి పడిపోయింది.

అరుతడి పంటలకు నీళ్లు విడుదల చేయాలి
పాల్తీ మంగ్లా నాయక్ (పాల్తీ తండా)

రెండెకరాలు వరి పంట సాగు చేశాను. పొట్ట దశలో ఉంది. బోర్లలో నీళ్లు రాక, చెరువులు ఎండిపోయి, భూగర్భజలాలు లేక పొలాలు వాడుబడుతున్నాయి. ఎఎంఆర్‌పి 8, 9 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు వారబంధి ప్రకారమైనా నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

పంటలు ఎండిపోతున్నాయి: కట్ట సైదిరెడ్డి మంగాపురం, వేములపల్లి మండలం

చెరువుల ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. యాసంగి పంట మొదట్లో బోర్లు ఆశాజనకంగా పోయడంతో ఆరు ఎకరాలు సాగు చేశాం. భూగర్భ జలాలు అడుగంటడంతో రెండు బోర్లు ఎండిపోయాయి. రెండు ఎకరాల మేర వరి పంట ఎండిపోయింది